ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
సోమవారం 6 జనవరి 2025



న్యూస్ బాక్స్

ఎన్టీపీసీ హెచ్‌వోపీగా చందన్ కుమార్


చందన్‌కుమార్

జ్యోతినగర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : రామగుండం ఎన్టీపీసీ, తెలంగాణ ఎస్‌టీపీపీ హెడ్ ఆఫ్ ది ప్రాజెక్టుగా చందన్ కుమార్ సామంత ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. బీహర్‌లోని నాబినగర్ ప్రాజెక్టు హెచ్‌వోపీగా పనిచేస్తున్న చందన్ కుమార్‌ను ఇటీవల రామగుండంకు బదిలీ చేసిన విషయం తెల్సిందే. రామగుండం ప్రాజెక్టు ఈడీ (హెచ్‌వోపీ)గా పని చేసిన కేదార్ రంజన్ పాండు గత నెల 31న పదవీ విరమణ చేశారు. కాగా, రామగుండం ప్రాజెక్టు హెచ్‌వోపీగా చార్జ్ తీసుకున్న చందన్ కుమార్ ఆదివారం ప్రాజెక్టులోని వివిధ విభాగాలలో పర్యటించారు. యూనిట్ కంట్రోల్ రూం, సీహెచ్‌పీ తదితర విభాగాల్లో పర్యటించి అధికారులను అడిగి వివరాలను తెలుసుకున్నారు.

రైతు భరోసాతో కాంగ్రెస్ పార్టీ మోసం తేటతెల్లం..

- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

మంథని, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ప్రజలను వంచించి మోసం చేయడమే కాంగ్రెస్ పార్టీ నైజమనే విషయం రైతు భరోసాతో మరోసారి తేటతెల్లమైందని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. అధికారంలోకి రావటానికి అచరణకు సాధ్యం కాని గ్యారెంటీలు ఇచ్చి ఆరు గ్యారెంటీల పేరిట గారడిగా మార్చారని విమర్శించారు. మంథని ఎమ్మెల్యేగా దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్‌గా రాష్ట్ర ఆర్థిక స్థితిగతులు తెలిసినప్పటికీ అమలకు సాధ్యం కాని హామీలతో మ్యానిఫెస్టోను రూపొందించి మంథనితో పాటు తెలంగాణ ప్రజలను మోసం చేశాడని ఆరోపించారు. పారిపాలన చేతకాక, సంక్షేమ పథకాలు అమలు చేయలేక చతికిల పడ్డ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందన్నారు. ఒక వైపు రుణ మాఫీ పూర్తిక, బోనస్ బోగస్ అయి ఇప్పటికే ఒక విడత రెతు భరోసాకు ఎగనామం పెట్టిన ప్రభుత్వం రబీ, ఖరీఫ్ సీజన్లకు కలిపి రూ.10వేల కోట్ల బకాయి లుపడిందన్నారు. అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి వాటిని నేరవేర్చడంలో విఫలమైన వ్యానిఫెస్టో కమిటీ చైర్మన్ దుద్దిళ్ల ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. కాళేశ్వరంప్రాజెక్టును ఎడారిగా మార్చి ఇసుక వ్యాపారం చేస్తున్నాడని ఆరోపించారు. చిన్నకాళేశ్వరం ప్రాజెక్టు ఊసేలేదన్నారు. అన్ని వర్గాలకు ఇచ్చిన హామీలను నేరవేర్చడంలో కాంగ్రెస్ విఫలమైందన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ

జ్యోతినగర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : లయన్స్‌క్లబ్ శతాబ్ది ఆధ్వర్యంలో ఆదివారం మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ గవర్నర్ ఎస్‌వి లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ సిహెచ్. కిషన్‌రావు, సెక్రెటరీ శ్రీనివాస్ కోశాధికారి వొల్లాల సురేష్ పేద మహిళలకు కుట్టు మిషన్లను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఎం. మహేందర్‌గౌడ్, ముకుందరెడ్డి, భరత్‌గౌడ్, అమరేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

- ఈ యాసంగి నుంచే పథకం అమలు
- సాగు చేసే భూములకే రైతు భరోసా
- ఎకరానికి రూ.6 వేల చొప్పున రెండు పంటలకు రూ. 12 వేలు

ఆంక్షలు లేకుండా రైతు భరోసా



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)


రైతుభరోసా పథకం అమలుపై నెలకొన్న ఉత్కంఠకు ప్రభుత్వం తెరదించింది. పథకాన్ని ఈ సీజన్ నుంచే అమలు చేస్తారా, వచ్చే సీజన్ నుంచి అమలు చేస్తారా, సాగు భూములకే ఇస్తారా, ధరణి పోర్టల్‌లో పట్టా కలిగిన రైతులందరికీ ఇస్తారా, భూములపై సీలింగ్ విధిస్తారా, మొత్తం భూమికి ఇస్తారా, ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షన్‌దారులు, ఐటీ చెల్లింపుదారులకు ఇస్తారా, ఇవ్వరా అనే అంశాలపై ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. ఎలాంటి ఆంక్షలు విధించకుండానే సాగు చేసే భూములకే భరోసా ఇస్తామని ప్రభుత్వం పేర్కొంది. ఎలాంటి దరఖాస్తులు లేకుండా జనవరి 26వ తేదీ నుంచే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని ప్రకటించారు. ఈ పథకం జిల్లాలో 2 లక్షల 60 వేల ఎకరాల భూములకు వర్తించే అవకాశాలున్నాయి. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన రైతు భరోసా పథకాన్ని ఈ యాసంగి సీజన్ నుంచి ప్రారంభించాలని శనివారం నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. అయితే ఎన్నికల సందర్భంగా ప్రకటించిన ఎకరానికి 7,500 రూపాయల చొప్పున గాకుండా 6 వేల చొప్పున రెండు పంటలకు కలిపి 12 వేల రూపాయలు ఇస్తామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దీంతో ఎకరానికి 1500 రూపాయలు తగ్గించడంపై ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని ప్రతిపక్ష పార్టీలు విమర్శిస్తున్నాయి. జిల్లాలో 1,55,496 మంది రైతులు 2,78,128 ఎకరాల భూములు కలిగి ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతు బంధు పథకం ద్వారా ఆయా సీజన్లలో పెరిగిన పట్టాదారులను అనుసరించి గత ఏడాది వర్షాకాలం సీజన్‌లో జిల్లావ్యాప్తంగా 1,46,819 మంది రైతులకు ఎకరానికి 5వేల చొప్పున 2,72,292 ఎకరాల భూములకు 136 కోట్ల 14 లక్షల 60 వేల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేశారు. అలాగే ప్రధాని కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా 67,332 మంది రైతులకు ఏడాదికి 6 వేల చొప్పున 40 కోట్ల 39 లక్షల 92 వేల రూపాయలు కేంద్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నది.

● జిల్లాలో 2.60 లక్షల ఎకరాలకు...

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రైతు భరోసా ప్రకారం రాళ్లు, రప్పలు, గుట్టలు, నాలా కన్వర్షన్ చేయకుండా రియల్ ఎస్టేట్ కోసం ప్లాటింగ్ చేసిన భూములు, ప్రజల ఉపయోగం కోసం రైతుల నుంచి ప్రభుత్వం సేకరించిన భూములకు మాత్రం రైతుభరోసా పథకాన్ని వర్తింపజేయమని పేర్కొంది. రుణమాఫీ పథకాన్ని వర్తింపజేసినట్లుగా ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షన్‌దారులు, ఆదాయ చెల్లింపుదారులకు రైతు భరోసా పథకాన్ని వర్తింపజేయరని, పెద్దఎత్తున భూములు కలిగిన భూస్వాములకు గాకుండా 10 ఎకరాల వరకు సీలింగ్ విధిస్తారని అంతా భావించారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా పంటలు సాగయ్యే భూముల యజమానులకు మాత్రమే రైతుభరోసా పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించింది. దీంతో జిల్లాలో 2లక్షల 60 వేల ఎకరాలకు రైతు భరోసా వర్తించే అవకాశాలున్నాయి. ఆ లెక్కన ప్రభుత్వం ఈ సీజన్‌లో ఎకరానికి 6వేల రూపాయల చొప్పున 156 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమచేయాల్సి ఉంటుంది. ప్రతి ఏటా జిల్లాలో యాసంగి సీజన్‌లో నీటి లభ్యతను బట్టి 2లక్షల 20వేల ఎకరాల

మిగతా 8వ పేజీలో...

వృథాగా ఎస్సారెస్పీ సాగునీరు..


వృథాగా పోతున్న సాగునీరు

ఓదెల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండల శివారు డి86 ఎస్సారెస్పీ ప్రధాన కాలువ నుంచి మడక వైపు వెళ్లే ఉపకాల్వ వైపు వెళుతున్న సాగునీరు ఎవరికి ఉపయోగం లేకుండా వృథాగా పోతోంది. ఉపకాల్వలో చెత్త, కర్రలు, వృథా ప్లాస్టిక్ పరికరాలు నీటితో తరలివచ్చి మధ్యలో ఉన్న కల్వర్టుకు అడ్డుగా తట్టుకోవడంతో కాలువలో నీటినిల్వ అధికమై వరినాట్లు వేసిన పొలాల నుంచి వరద వెళుతోంది. దీంతో చింతం సత్యనారాయణ అనే రైతుకు చెందిన పొలం నీటి కోతకు గురై వేసిన నాటు నీటి వరదకు కొట్టుకు వెళ్లింది. మడకవైపు వెళ్లే డి 86 కాలువ తూము నిబంధనకు విరుద్ధంగా ఉండడంతో అధికంగా నీటిపారకం పోటెత్తుతోంది. దీంతో కాల్వ సాఫీగా లేక రైతులు సాగుచేసిన పంటపై నుంచి నీరు వృథా వెళుతున్నప్పటికీ ఏ అధికారి తగిన చర్యలు తీసుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముందుగా ఉపకాల్వల్లో జంగిల్ కటింగ్ పనులు చేసిన తర్వాతనే సాగునీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

పెరిగిన చలి తీవ్రత..

కళ్యాణ్‌నగర్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా చలి తీవ్రత పెరిగిపోయింది. గురువారం నుంచి అకస్మాత్తుగా ఆరు డిగ్రీల ఉష్ణోగ్రతలు పడిపోయాయి. సాయంత్రం 6గంటలు దాటితే ఈదురు గాలులు వణికిస్తున్నాయి. గురువారం గరిష్ట 30.2, కనిష్ట 12.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా శుక్రవారం 30.8, 12.8 డిగ్రీలు నమోదు కాగా, శనివారం 31.2, 12.2డిగ్రీలు, ఆదివారం 30.2, 12.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. తెల్లవారుజామున చలి తీవ్రత ఎక్కువగా ఉంటోంది. ఉదయం 9గంటలు అయినా చలిప్రభావం తగ్గడం లేదు. మంచు దుప్పటి కప్పుకుని ఉంటుంది. ఉదయం వివిధ గ్రామాల నుంచి వచ్చే కూరగాయలు, పాలు విక్రయించే వారు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు ఊడ్చే పారిశుధ్య కార్మికులు చలి తీవ్రతలోనే విధులు నిర్వహిస్తున్నారు.

గాలిపటాల దుకాణాల్లో పోలీసుల తనిఖీలు

కోల్‌సిటీ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పట్టణంలోని లక్ష్మీనగర్, కళ్యాణ్‌నగర్, మార్కండేయకాలనీలోని గాలిపటాల విక్రయ దుకాణాలలో ఆదివారం గోదావరిఖని వన్‌టౌన్‌పోలీసులు తనిఖీలు నిర్వహించారు. సీఐ రవీందర్ ఆధ్వర్యంలో తనిఖీలు జరిపిన పోలీసులు మాంజా దారాలపై ఆరా తీశారు. మాంజా వినియోగించడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారని, అవి తగిలి మరణాలు సంభవిస్తున్నాయన్నారు. సంక్రాంతి సెలవుల్లో పిల్లలు గాలి పటాలు ఎగురవేస్తూ ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నీరుకుళ్ల ఆలయంలో మంచిర్యాల జిల్లా జడ్జి పూజలు

సుల్తానాబాద్, జనవరి 5: (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీరుకుళ్ల శ్రీభూనీళా సమేత రంగనాయక స్వామి దేవాలయాన్ని మంచిర్యాల జిల్లా జడ్జి అర్పిత సందర్శించి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. దేవాదాయ శాఖ అధికారులు శంకర్, ప్రవీణ్ ఆలయ ప్రధానఅర్చకులు గోవర్ధనగిరి మనోహరాచార్యులు, రాజ్‌కుమారాచార్యులు జడ్జికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం జడ్జిని సత్కరించి ఆశీర్వచనం అందజేశారు. జడ్జి వెంట జిల్లా కోర్టు సూరిండెంటెంట్ మాధవి ఉన్నారు.

ఈత మొక్కలు తొలగించిన వ్యక్తులపై చర్యలు..

పాలకుర్తి,జనవరి 5(ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని జయ్యారంలో సుమారు 15 ఈతమొక్కలను గ్రామానికి చెందిన గుండ జగ్గయ్య, అతడి సోదరుడు గుండ దయాకర్‌లు ఆదివారం తొలగించారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్ గౌడ్, జయ్యారం గౌడ కుల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై ఎక్సైజ్, పోలీస్ శాఖలకు సోమవారం ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మహాత్మగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం ఫీల్డ్‌అసిస్టెంట్ గంగాధరి గిరిగౌడ్, వండ్లకొండ తిరుపతి గౌడ్, వెలిచాల రాయముల్లు గౌడ్, పొన్నం లింగం గౌడ్, బండ సత్తి గౌడ్, భూషణవేణి రాజయ్య గౌడ్, వడ్లకొండ బాపుగౌడ్, అమరగాని సత్తిగౌడ్ పాల్గొన్నారు.

తెరపైకి మరో నాలుగు కొత్త మండలాలు

- ప్రతిపాదనలు పంపిన అధికారులు

- జిల్లా జోరుగా చర్చ..

పెద్దపల్లిటౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మరో నాలుగు కొత్త మండలాలు ఏర్పడనున్నాయి. ఈ మేరకు అధికార యంత్రాంగం ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించారు. జిల్లాల పునర్విభజన సమయంలో పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా అప్పటి ప్రభుత్వం మూడు కొత్త మండలాలను ఏర్పాటు చేసింది. ఇందులో పాలకుర్తి, అంతర్గాం, రామగిరి నూతనంగా ఏర్పాటయ్యాయి. దీంతో జిల్లాలో 14 మండలాలు ఏర్పడ్డాయి. తాజాగా మరో 4 మండలాల ఏర్పాటుకు జిల్లా అధికారులు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించారు. పెద్దపల్లి నియోజకవర్గంలోని పెద్దపల్లి మండలం రాఘూవాపూర్, సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి, రామగుండం నియోజకవర్గంలోని రామగుండం మండలం జనగామ, మంథని నియోజకవర్గంలోని మంథని మండలం గుంజపడుగు గ్రామాలను మండలాలుగా చేసేందుకు నివేదికలు పంపించారు. మంత్రి శ్రీధర్‌బాబు ఎప్పటినుంచో గుంజపడుగును మండలంగా చేయాలన్న ఆలోచనతో ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. పెద్దపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు గర్రెపల్లిని మండలంగా ఏర్పాటుచేయాలని ఎన్నోసార్లు ప్రభుత్వాల దృష్టి తీసుకెళ్లారు. గర్రెపల్లితో పాటు రాఘూవాపూర్ కూడా తెరమీదకు వచ్చింది. రామగుండం మండలం విస్తీర్ణం, జనాభా ఎక్కువగా ఉండడంతో జనగామను మండలంగా ఏర్పాటుచేయనున్నారు. అయితే ప్రజా పాలన, అవసరాల దృష్ట్యా ప్రభుత్వమే జిల్లా యంత్రాంగాన్ని నివేదిక కోరినట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష పేర్కొన్నారు. ఆ మేరకు ఈ గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ లెక్కన పెద్దపల్లి నియోజకవర్గానికి రెండు, మంథనికి ఒకటి, రామగుండం నియోజకవర్గానికి ఒకటి చొప్పున మండలాల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చే అవకాశం ఉంది. అయితే ఇందులో ఏమైనా మార్పుచేర్పులు జరుగనున్నాయా.. ఈ మండలాల పరిధిలో ఏయే గ్రామాలు తీసుకుంటారనేది, మండలానికి ఎన్ని గ్రామాలు ఉంటాయనే చిక్కుముడి వీడడం లేదు. ఇప్పటివరకు పెద్దపల్లిలో పెద్దపల్లి, జూలపల్లి, సుల్తానాబాద్, ఎలిగేడు, జూలపల్లి, కాల్వశ్రీరాంపూర్, ఓదెల మండలాలకు తోడుగా గర్రెపల్లి, రాఘవాపూర్ మండలాలుగా చేరనున్నాయి. రామగుండంలో పాలకుర్తి, రామగుండం, అంతర్గాంలతో పాటు జనగామ మండలంగా ఏర్పడనున్నది.

మంథని నియోజకవర్గంలో..

పెద్దపల్లి జిల్లాగా ఆవిర్భావం, కొత్త మండలాల ఏర్పాటులో భాగంగా పలిమెల, రామగిరి మండలాలు ఏర్పాటయ్యాయి. అయితే అప్పటికే మంథని నియోజకవర్గంలో మహదేవపూర్, మంథని, కాటారం, మల్హర్, మహాముత్తారం, ముత్తారం, కమాన్‌పూర్ మండలాలుగా ఉన్నాయి. అయితే కొత్తగా ఏర్పడిన భూపాల్‌పల్లి జిల్లాలో పలిమెల, మహదేవపూర్, కాటారం, మల్హర్, మహాముత్తారం మండలాలు కలిపినప్పటికి మంథని నియోజకవర్గం పరిధిలో ఉన్నాయి. ఇక్కడి ఎమ్మెల్యేనే ఈ మండలాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గత సాధారణ ఎన్నికల్లో కూడా ఈ మండలాల్లో మార్పు జరగలేదు. రానున్న ఎన్నికల్లో పునర్విభజన జరిగితే ఆ ఐదు మండలాలు భూపాల్‌పల్లి నియోజకవర్గంలోకి వెళ్లే అవకాశం ఉంది. ముత్తారం, మంథని, కమాన్‌పూర్, రామగిరి, గుంజపడుగు మండలాలు మంథని నియోజకవర్గంలో ఉండే అవకాశం ఉంది.

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతిపాదనలు పంపించాం..

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



ప్రభుత్వ ఆదేశాల మేరకు, ఇక్కడి ప్రజా అవసరాలు పరిపాలన దృష్టా కొత్త మండలాలపై ప్రతిపాదనలు పంపించాం, ప్రభుత్వ నిర్ణయం మేరకు మండలాల ఏర్పాటు జరుగుతుంది. ఏయే గ్రామాలు ఎందులోకి వస్తాయి, మండలానికి ఎన్ని గ్రామాలు కలపాలన్నది పరిశీలించి చేపడుతాం.

నిరుపయోగంగా బస్ షెల్టర్లు..


పత్తిపాక ఎక్స్‌రోడ్ వద్ద బస్‌షెల్టర్‌లో నిలిపిన బైక్‌లు

ధర్మారం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రయాణికుల కోసం కట్టిన బస్ షెల్టర్లు నిరుపయోగంగా మారుతున్నాయి. కొన్ని చోట్ల బస్‌షెల్టర్‌లలో ద్విచక్ర వాహనాలు నిలుపుతుండగా, మరికొన్ని చోట్ల బస్ షెల్టర్ల నిర్మాణం ప్రయాణికులకు అనుకూలంగా లేకపోవడంతో బస్సుల కోసం బయట నిల్చుంటున్న పరిస్థితి ఉంది. ప్రయాణికుల సౌకర్యార్థం మండలంలోని మేడారం, శాయంపేట, బొట్లవనపర్తి, పత్తిపాక ఎక్స్ రోడ్, మల్లాపూర్‌తోపాటు మరికొన్ని గ్రామాల్లో ఆర్టీసీ బస్ షెల్టర్స్ ఏర్పాటుచేశారు. వీటి నిర్వహణ సరిగా నిరుపయోగంగా మారుతున్నాయి. పత్తిపాక ఎక్స్‌రోడ్ వద్ద నిర్మించిన బస్ షెల్టర్‌లో ద్విచక్ర వాహనాలను నిలిపి వెళ్తున్నారు. దీంతో అందులో ప్రయాణికులు కూర్చోలేక ఇబ్బంది పడుతున్నారు. పలుచోట్ల బస్‌షెల్టర్లలో కూర్చున్న ప్రయాణికులకు వచ్చే బస్సులు కనబడక బయటకు వచ్చేసరికి వెళ్లిపోతున్నాయి. దీంతో బయటే నిలబడి బస్సుల కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ప్రమాదాలకు నిలయం.. దుబ్బపల్లి యూటర్న్..

- అదుపు తప్పుతున్న వాహనాలు - పట్టించుకోని అధికారులు


దుబ్బపల్లి యూటర్న్ వద్ద లారీని ఢీకొన్న బైక్(ఫైల్)

సుల్తానాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుబ్బపల్లి యూటర్న్ ప్రమాదాలకు నిలయంగా మారింది. తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో, ఇప్పటికే కొందరు మృత్యువాత పడగా, పదుల సంఖ్యలో వాహనదారులు క్షతగాత్రులయ్యారు. అయితే సంబంధిత అధికారులు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు. సమీప గ్రామాల వాహనదారులు యూటర్న్ తీసుకుంటున్న సందర్భాల్లో వేగంగా వచ్చే వాహనాలు ఢీకొడుతున్నాయి. సుల్తానాబాద్ ప్రాంతంలోని పలు రైస్‌మిల్లుల నుంచి, గర్రెపల్లిలోని గోదాముల నుంచి వచ్చే భారీ వాహనాలు సమీపంలోని బంకుల్లో ఇంధనం నింపుకొని పెద్దపల్లి, సుల్తానాబాద్ వెపు వెళ్లడానికి యూటర్న్ తీసుకుంటున్న సందర్భంలో వెనకాల వచ్చే వాహనాలు అదుపు తప్పుతున్నాయి. దీంతో యూటర్న్ తీసుకుంటున్న వాహనాలను ఢీకొంటున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎన్టీపీసీ డైరెక్టర్‌తో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ భేటీ

- కార్మిక సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి


ఎన్టీపీసీ డైరెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

జ్యోతినగర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీపీసీ సంస్థ మానవ వనరుల(హెచ్‌ఆర్) డైరెక్టర్ అనిల్ కుమార్ జాడ్లీతో ఆదివారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రామగుండం ఎన్టీపీసీలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు, స్థానిక సమస్యలపై ఎన్టీపీసీ డైరెక్టర్‌తో ఎమ్మెల్యే చర్చించారు. ఎన్టీపీసీలో పనిచేస్తున్న కార్మికులకు సంబంధించి ఫిట్‌నెస్(ఆరోగ్యంగా)తో ఉన్న కార్మికులను 65సంవత్సరాల వరకు విధుల్లో కొనసాగించాలని మక్కాన్‌సింగ్ కోరారు. కాంట్రాక్టు కార్మికులకు కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్యం అందేలా ఆసుపత్రిని నిర్మించాలని, కార్మికుల పిల్లలకు కార్పొరేట్ స్థాయి ఇంగ్లీషు మీడియం ఉచిత విద్యను అందించాలని, కార్మిక పిల్లలు మంచి క్రీడాకారులుగా ఎదిగేందుకు అన్ని వసతులతో కూడిన ఆధునిక స్టేడియంను నిర్మించాలని, ఎన్టీపీసీ పరిధిలోని రాజీవ్ రహదారికి రెండు వైపులా మిగిలిపోయిన సర్వీస్ రోడ్డును పూర్తి చేయాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ కోరుతూ డైరెక్టర్ జాడ్లీకి వినతిపత్రాన్ని అందజేవారు. త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని డైరెక్టర్ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కాగా, ఎమ్మెల్యే వెంట ఎన్టీపీసీ జ్యోతినగర్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ ఆసిఫ్‌పాషా ఉన్నారు.

బాధిత కుటుంబాలకు మంత్రి శ్రీధర్‌బాబు పరామర్శ

ముత్తారం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మచ్చుపేట, ఖైదంబండ గ్రామాల్లో ఆదివారం బాధిత కుటుంబాలను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పరామర్శించారు. మచ్చుపేటలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడుదుండే రాజేశం ఇటీవల మృతిచెందగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఖైదంబండలో యూత్ కాంగ్రెస్ నాయకుడు బియ్యని రాజబాబు తండ్రి మృతిచెందగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ చొప్పరి సదానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, యూత్ నాయకుడు బియ్యని శివకుమార్, మాజీ సర్పంచ్ సిరికొండ బక్కారావు, తూటి రజిత రఫీ, మద్దెల రాజయ్య, బూడిద శ్రీనివాస్, చెలకల జీతేందర్ యాదవ్, వాజిద్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

● కమాన్‌పూర్ (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీపీ కోలేటి మారుతి తల్లి ఇటీవల మృతిచెందగా ఆదివారం మంత్రి శ్రీధర్‌బాబు పరామర్శించి ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని వ్యక్తం చేశారు.


బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

ఆండాళమ్మ ఆలయానికి 'హరిత' కళ

- పచ్చని చెట్ల మధ్య సేద తీరుతున్న సందర్శకులు 8


ముత్తారం గ్రామంలోని ఆండాళమ్మ ఆలయం

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే భరోసా..

- రామగుండం సీపీ శ్రీనివాస్.. 8


5కే రన్‌ను ప్రారంభిస్తున్న సీపీ శ్రీనివాస్

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

- మరొకరి తీవ్ర గాయాలు


సంపత్ (ఫైల్)

జమ్మికుంట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలో ఆదివారం ఉదయం మోపెడ్‌ను ఓ కారు ప్రమాదవశాత్తు ఢీకొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని మారుతినగర్‌కు చెందిన గుడికందుల సంపత్ (55) తన మోపెడ్‌పై పెద్దంపల్లి గ్రామానికి చెందిన స్నేహితుడు రాజయ్యను తీసుకుని పనికి వెళ్తున్నాడు. ఇదే సమ యంలో జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి చెందిన వైద్యురాలు తనకారులో హుజూరాబాద్ నుంచి జమ్మికుంటకు వస్తోంది. పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్ సమీపంలోకి రాగానే అవతలి వైపు నుంచి వస్తున్న సంపత్ తన వాహనాన్ని ఒక్కసారిగా యూటర్న్ చేశాడు. ప్రమాదవశాత్తు కారు మోపెడ్‌ను ఢీకొట్టింది. కిందపడిన రాజయ్య కాలు విరిగింది. సంపత్ తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎమ్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సంపత్ మృతి చెందాడు. రాజయ్య చికిత్స పొందుతున్నాడు. సంపత్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

రోడ్డుప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


మాశెట్టి అశోక్(ఫైల్)

తిమ్మాపూర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వెంకట్రావుపేట గ్రామ సమీపంలో పదిరోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మాశెట్టి అశోక్(65) అనే వ్యక్తి ఆదివారం చికిత్సపొందుతూ మృతి చెందాడు. మండలంలోని మహాత్మానగర్ గ్రామానికి చెందిన పోలవేణి గట్టుబాబు, అతడి భార్య మంగ(50), సోదరి మాశెట్టి అహల్య, బావ అశోక్‌తో కలిసి డిసెంబరు 26న వేములవాడలో ఓ శుభాకార్యానికి హాజరయ్యారు. తిరిగి కారులో ఇంటికి వస్తున్న క్రమంలో బోయినపల్లి మండలం వెంకట్రావుపల్లి వద్ద రోడ్డుపై నిలిపి వున్న లారీని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మంగ అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందింది.

గట్టుబాబు, మాశెట్టి అశోక్, అహల్య తీవ్రంగా గాయపడ్డారు. ఇందులో గట్టుబాబు పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గత నెల 28వ తేదీన గట్టుబాబు మృతి చెందాడు. గాయపడిన మాశెట్టి అశోక్, అహల్య కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. మాశెట్టి అశోక్(65) చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. అశోక్ భార్య అహల్య ఆస్పత్రిలోనే చికిత్స పొందుతుంది. పది రోజుల వ్యవధిలో బావ, బావమరుదుల కుటుంబాల్లో ముగ్గురు మృతిచెందడంతో బంధువుల్లో విషాదం నెలకొంది.

పతంగులతో జర పైలం..

- సంక్రాంతి సీజన్‌లో పిల్లలు, యువకుల సందడి
- గాలిపటం ఎగరవేసేందుకు చైనా మాంజా విరివిగా ఉపయోగం
- మాంజా... మనుషులు, పక్షులకు ప్రమాదకరం





కరీంనగర్ క్రైం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ వచ్చిందంటే పతంగులు ఎగురవేసేందుకు పిల్లల, యువకులు ఉత్సాహం చూపుతుంటారు. సంక్రాంతి సెలువుల్లో పిల్లల ప్రతీ ఇంట పతంగులు ఎగురవేస్తూ సంబురాలు చేసకుంటుంటారు. కొన్ని సందర్భాల్లో యువకులు, పిల్లలు పతంగుల ఎగురవేతలో పోటీలు కూడా పెట్టుకుంటారు. సంక్రాంతి సమయంలో ఆకాశం రంగురంగుల గాలిపటాలతో కళకళలాడుతుంటుంది. ఈ పతంగు లతో జర పైలంగా ఉండాల్సిన అవసరం ఉంది. సాధారణ పతంగుల దారంతో ప్రమాదం ఏమీ లేనప్పటికీ చైనా మాంజాలు మనుషులకు, పక్షులకు ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయి. ముఖ్యంగా చైనా మాంజాను వాడకపోవటం మంచిదని అటవీశాఖ, పోలీసుశాఖల అధికారులు, పక్షి ప్రేమికులు అంటు న్నారు. పతంగి ఎగురవేసేందుకు వినియో గిస్తున్న నిషేధిత చైనా మాంజా గాలిలో ఉన్నప్పుడు, చెట్లకు చిక్కుకున్న సమయంలో దారిన వెళ్లే ద్విచక్రవాహనదారుల మెడకు చుట్టుకోవడం, పక్షుల రెక్కలకు చుట్టుకోవడంతో మెడ, రెక్కలు తెగి తీవ్రరక్తస్రావంతో మరణాలు సంభవిస్తాయి. ఇటీవల భద్రాచలం, జనగాం ప్రాంతాల్లో రెండు మూడు సంఘటనలు చోటు చేసుకున్నాయి. కొంతమంది మరీ పోటీలు పెట్టుకుని గాలిపటాలు గాల్లో ఎక్కువ ఎత్తులో ఎగురవేసేందుకు చైనా మాంజా దారం ఉపయోగిస్తారు. మాంజాకు గాజు పొడి లేదా ప్లాస్టిక్ అద్ది దృఢంగా తయారు చేస్తున్నారు.

● మాంజాపై నిషేధం ఉన్నా..

మాంజా కారణంగా పెద్దసంఖ్యలో పక్షులు, మనుషులు తీవ్రగాయాల పాలవటం, కొన్ని సందర్భాల్లో మరణాలు సంభవిస్తుండటం కారణంగా రాష్ట్రంలో చైనా మంజా, గాజు పొడి అద్దిన మాంజాల అమ్మకంపై నిషేధం విధించారు. అయినప్పటికీ మార్కెట్‌లో విక్రయాలు జరుగుతున్నాయి. చైనా మాంజాపై అవగాహనలేని పిల్లలు దానిని కొనుగోలు చేస్తూ పతంగులు ఎగురవేసేందుకు ఉపయోగిసు న్నారు. గతంలో చైనా మాంజాను ఇతర రాష్ట్రాల నుంచి రహస్యంగా తీసుకువచ్చి స్థానికంగా విక్రయించేవారని, ప్రస్తుతం స్థానికంగానే తయారు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. చైనా మాంజాను నైలాన్, సింథటిక్ దారానికి గాజు, ప్లాస్టిక్ పొడి పూసి తయారు చేస్తుంటారు. ఇది సాధారణ దారం కంటే దృఢంగా, పదునుగా ఉంటుంది. పతంగులు ఎగురవేసిన తర్వాత మాంజాను అలానే వదిలేస్తుండడంతోపాటు కొన్ని సందర్భాల్లో తెగిన గాలిపటం మాంజా ఎక్కడో దూరంగా పడిపోతుంది. మాంజాను తిరిగి సేకరించకుండా అలానే వదిలేస్తుంటారు. పతంగి తెగిన తర్వాత మాంజాతో గాలిలో తేలుతూ ఉంటుంది. కొన్ని సందర్భాల్లో చెట్లు, ఎత్తైన భవనాలకు, టవర్లకు చిక్కుకుంటుంది. ద్విచక్ర వాహనంపై వెళ్లే వారికి గొంతుకు చుట్టుకుంటోంది. చెట్లపై చిక్కిన మాంజా పక్షులకు చుట్టుకుని తీవ్రగాయాలై మరణిస్తున్నాయి. దీంతో మాంజాను ఉపయోగించే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని పక్షుల ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు. మాంజాలు ఉపయోగించవద్దని పోలీసులు, అటవీశాఖ అధికారులు వ్యాపారుల దుకాణాల్లో తనిఖీలు చేస్తున్నా ఫలితం మాత్రం కనిపించడం లేదు.

మాంజాను విక్రయిస్తే చర్యలు...

- షౌకత్ హుస్సేన్, కరీంనగర్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్

గాలిపటాల ఎగరవేతకు గాజు, ప్లాస్టిక్ పూతతో కూడిన మాంజాను విక్రయిస్తే వ్యాపారులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. రాష్ట్రంలో చైనా మంజా నిషేధం. విక్రయాలు చేపడితే ఫారెస్ట్ యాక్టు ప్రకారం ఏడు సంవత్సరాల జైలుశిక్ష ఉంటుంది. గాజు పొడి, ప్లాస్టిక్‌తో తయారు చేసిన మాంజాతో మనుషులతోపాటు పక్షులకు కూడా ప్రమాదకరం. కరీంగనర్‌లో మాంజా విక్రయాలు జరపకుండా తనిఖీలు నిర్వహిస్తూ వ్యాపారులను హెచ్చరిస్తున్నాం. చైనా మాంజాను ప్రజలు ఉపయోగిస్తూ సంక్రాంతి పండుగ వేళ ఇబ్బందులపాలు కావద్దు. ఎక్కడైనా చైనా మాంజా విక్రయాలు జరుగుతున్నట్లు తెలిసిస్తే వెంటనే సమాచారం అందించాలి.

కిలో గంజాయి పట్టివేత

- నలుగురి అరెస్టు

పెగడపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండలంలోని నార్సింహునిపేట శివారులో ఆదివారం నలుగురు వ్యక్తుల నుంచి కిలో గంజాయి స్వాధీనం చేసుకుని నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికిరణ్ తెలిపారు. నార్సింహునిపేట గ్రామశివారులో నలుగురు వ్యక్తుల వద్ద నిషేధిత గంజాయి ఉన్నట్లు అందిన పక్కా సమాచారం మేరకు పెగడపల్లి ఎస్ఐ రవికిరణ్ స్థానిక పోలీస్ సిబ్బందితో కలిసి దాడి నిర్వహించి కిలో గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారివద్ద నుంచి మూడు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నలుగురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవి కిరణ్ తెలిపారు.

మల్యాలలో గుడిసెలు దహనం

ఇల్లందకుంట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన గీత కార్మికులు తాటి వనంలో వేసుకున్న గుడెసెలను గుర్తుతెలియని వ్యక్తులు దహనం చేశారు. శనివారం సాయంత్రం కార్మికులు తాటివనం నుంచి ఇంటికి వెళ్లారు. ఆదివారం ఉదయం వచ్చేసరికి గుడిసెలు పూర్తిగా కాలిపోయాయి. గుర్తుతెలియని వ్యక్తులు కాల్చివేశారని పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయనున్నట్లు కార్మికులు తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

కొడిమ్యాల, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన రాచకొండ రాజేందర్ అనే వ్యక్తి తన విధులకు ఆటంకం కలిగించాడని కానిస్టేబుల్ రాకేష్ ఫిర్యాదు మేరకు కొడిమ్యాల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ ఆదివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు శనివారం రాత్రి కొడిమ్యాల బస్టాండ్ సమీపంలో పది గంటల ప్రాంతంలో ఎస్సై, పోలీసులు వాహన తనిఖీలో భాగంగా డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో రాజేందర్ తన వాహనాన్ని వేగంగా నడుపుతూ కిందపడిపోయాడు. అతడిని పరీక్షించగా పోలీసుల మీదికి దురుసుగా ప్రవర్తించినట్లు ఎస్సై తెలిపారు. కానిస్టేబుల్ రాకేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

భూమి కోసం పొలంలో కూర్చుని రైతు నిరసన


పొలంలో కూర్చుని నిరసన తెలుపుతున్న రైతు గట్టయ్య

హుజూరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని దమ్మక్కపేట గ్రామంలో తనకు చెందాల్సిన రెండున్నర గుంటల భూమి వెంటనే ఇవ్వాలని ఆదివారం బరిగే గట్టయ్య అనే రైతు పొలంలో కూర్చొని నిరసన తెలిపాడు. గట్టయ్య తెలిపిన వివరాల ప్రకారం.. దమ్మక్కపేటకు చెందిన గట్టయ్య తండ్రి 20ఏళ్ల క్రితం ఓ వ్యక్తి నుంచి 20 గుంటల భూమి కొనుగోలు చేశాడు. అప్పటి నుంచి భూమి సాగు చేసుకుంటున్నారు. కాగా భూమి తక్కువగా ఉందనే అనుమానంతో గట్టయ్య హుజూరాబాద్ తహసీల్దార్‌కు భూమి కొలత కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఈ మేరకు సర్వేయర్‌తో కొలతలు చేపట్టారు. రెండున్నర గుంటల భూమి పక్కనే ఉన్న రైతు సమ్మిరెడ్డి పొలంలో ఉన్నట్లు అధికారులు తేల్చారు. ఆ సమయంలో పంట వేసి ఉంది. పంట కోత పూర్తయ్యాక ఆ భూమిని వదిలేస్తానని చెప్పిన సమ్మిరెడ్డి ఏడాది దాటినా పట్టించుకోక పోవడంతో గట్టయ్య ఆదివారం నిరసన చేపట్టాడు. రెండున్నర గుంటల భూమి ఇచ్చేంతవరకు నిరసన కొనసాగిస్తానని గట్టయ్య తెలిపాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు.

కొండగట్టుకు సమగ్ర శిక్ష ఉద్యోగుల పాదయాత్ర

- అంజన్న ఆలయంలో డిమాండ్ల అమలుకు పూజలు



కొండగట్టుకు పాదయాత్రగా వస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

మల్యాల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తమను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని సమగ్రశిక్ష ఉద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇరవై అయిదు రోజులుగా డిమాండ్ల సాధన కోసం చేస్తున్న ధర్నాలో భాగంగా ఉమ్మడి కరీనంనగర్ జిల్లాకు చెందిన సమగ్ర శిక్ష ఉద్యోగులు ఆదివారం జగిత్యాలలోని తహసీల్ చౌరస్తా నుంచి కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయం వరకు మహాపాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా అంజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తమ డిమాండ్లు ప్రభుత్వం అంగీకరించేలా చూడాలని స్వామి వారికి పూజలు చేశారు సీఎం రేవంత్‌రెడ్డి గతంలో ఇచ్చిన హామీని అమలు చేయాలని స్వామి అంజన్నకు వినతిపత్రం అందజేశారు. జగిత్యాల, కరీంనగర్, సిరిసిల్లా, పెద్దపెల్లి జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన సమగ్ర శిక్ష ఉద్యోగులు మహాపాద యాత్రలో పాల్గొన్నారు

మతాంతర వివాహ చిచ్చు

జమ్మికుంట రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని పద్మశాలి వాడకు చెందిన ఓ ఇంట్లో మతాంతర వివాహం చిచ్చు రేపింది. కూతురు మతాంతర వివాహం చేసుకోగా ఓ తండ్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎండీ కలీం (45) కుమార్తె ఈ నెల 2న మతాంతర వివాహం చేసుకుంది. దీంతో తండ్రి కలీం మనస్తాపానికి గురయ్యాడు. శనివారం తెల్లవారుజామున పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందాడు. కలీం భార్య సహేదా సుల్తానా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

అంత్యక్రియలకు వెళ్లి వస్తూ మహిళ మృతి

హుజూరాబాద్‌రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): అంత్యక్రియలకు వెళ్లి వస్తూ ఓ మహిళ రోడ్డు ప్రమాదానికి గురికాగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలం కల్వల గ్రామానికి చెందిన గాజుల ఓదమ్మ(68) అనే మహిళ శనివారం జూపాక గ్రామంలో అంత్యక్రియ లకు హాజరైంది. తిరిగి ఇంటికి వెళ్లేందుకు రాంపూర్ గ్రామంలోని జూపాక క్రాస్ రోడ్డు వద్దకు చేరుకుంది. ఈ క్రమంలోనే శంకరపట్నం మండలం మొలంగూరు గ్రామానికి చెందిన కాజా కలీంఉల్లా కారు అతివేగంగా వచ్చి ఓదమ్మను ఢీకొట్టింది. ఆమెకు తీవ్రగాయాలు కావడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్సపొందుతూ రాత్రి మృతి చెందింది. ఓదెమ్మ కుమారుడు సర్వేశ్వర్ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

జమ్మికుంట రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామ మానేరు పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను మున్సిపల్ పరిధిలోని ధర్మారంలో ఆదివారం పోలీస్‌లు పట్టుకున్నారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్లను స్వాధీనం చేసుకోని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమానులు రంజిత్, రజనీకాంత్, రాజు, శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

తెలంగాణ సంస్కృతి గొప్పది

- తెలుగు విశ్వవిద్యాలయ ఉపకులపతి నిత్యానందరావు


మిడ్ మానేరు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

కరీంనగర్ కల్చరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతి గొప్పదని తెలుగు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య వెల్దండి నిత్యానంద రావు అన్నారు. కరీంనగర్‌లో ఆదివారం శరత్ సాహితీ కళా స్రవంతి రజతోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఒక సాహిత్య సంస్థ రజతోత్సవాలను జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా సంస్థ పక్షాన ఆరు పుస్తకావిష్కరణలు జరిగాయి. మూడు సాహిత్య పురస్కారాలు అందజేశారు. సబ్బని సమీక్షలు-విమర్శలు పుస్తకాన్ని కల్‌బుర్గి కర్ణాటక కేంద్రీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య బట్టు సత్యనారాయణ పుస్తకాన్ని ఆవిష్కరించగా సబ్బని రాసిన అవ్వ ది మదర్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. సబ్బని ఛార్‌ధామ్ యాత్ర పుస్తకాన్ని జాతీయ స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంఘం అధ్యక్షుడు బోయినపల్లి హనుమంతరావు ఆవిష్కరించారు. సబ్బని మౌన సముద్రం పుస్తకాన్ని సమాజ సేవకుడు కొండూరు జగన్మోహనరావు ఆవిష్కరించగా అవ్వ పుస్తక ఫ్రెంచ్ అనువాద పుస్తకాన్ని అరసం జిల్లా అధ్యక్షుడు గులాబీల మల్లారెడ్డి, అవ్వ పుస్తక జపనీస్ భాషానువాద పుస్తకాన్ని డాక్టర్ మచ్చ హరిదాసు ఆవిష్కరించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి సంకేపల్లి నాగేంద్రశర్మ రాసిన మిడ్ మానేరు పుస్తకాన్ని ఆచార్య వెల్దండి నిత్యానందరావు ఆవిష్కరించారు. కాగా బెంగాలీ రచయిత్రి కాబేరి ఛటోపాధ్యాయకు సబ్బని నాగమ్మ-మల్లేశం స్మారక సాహిత్య పురస్కారాన్ని, ఆచార్య వెల్దండి నిత్యానందరావుకు సంకేపల్లి కాంతయ్య-కమలమ్మ స్మారక సాహిత్య పురస్కారాన్ని, సంస్థ పక్షాన డాక్టర్ పి రమేశ్ నారాయణకు అనువాద పురస్కారాన్ని అందజేశారు. డాక్టర్ సబ్బని రాసిన సమీక్షలు-విమర్శలు గ్రంథాన్ని కొండూరు జగన్మోహన్‌రావుకు, నాగేంద్రశర్మ రాసిన మిడ్ మానేరు కవిత్వాన్ని జర్నలిస్ట్ పిఎస్ రవీంద్ర దంపతులకు అంకితమిచ్చారు. కార్యక్రమంలో ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణ, తండ హరీశ్‌గౌడ్, మానస ఆర్ట్ థియేటర్ కార్యదర్శి రఘుశ్రీ, పీఎస్ రవీంద్ర, మాడిశెట్టిగోపాల్, కేఎస్ అనంతచార్య, హిందీ రచయితలు సుష్మా త్రిపాఠి, శేఖర్ త్రిపాఠి, డాక్టర్ బొద్దుల లక్ష్మయ్య, డాక్టర్ ఇ భద్రయ్య, రవి, దేవానదం, వైరాగ్యం ప్రభాకర్, నవనీతరావు, రామేశం, సురేందర్ రెడ్డి, అనిల్, లక్ష్మీపతి, రామరాజు పాల్గొన్నారు.

నడక పోటీలో కాలనీ మహిళ ప్రతిభ


కంటెవాడ రాధ

షైటింక్లయిన్‌కాలనీ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో కాలనీకి చెందిన కంటెవాడ రాధ తృతీయ స్థానంలో నిలిచి సత్తాచాటింది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరుగుతున్న 11వ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్ స్టేట్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో మహిళల విభాగంలో జరిగిన నడక పోటీల్లో కండెవాడ రాధ(48) తృతీయ స్థానంలో నిలిచింది. ఐదేళ్లుగా మాస్టర్స్ అథ్లెటిక్‌గా రాణిస్తున్న రాధ జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చింది. జాతీయ స్థాయి పోటీల్లో రాణించిన రాధకు తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ప్రభుకుమార్, జిల్లా అధ్యక్షకార్యదర్శులు పురుషో త్తం, మహేందర్‌రెడ్డి అభినందనలు తెలిపారు.

ఘనంగా కొరాయి ఉత్సవం

- వనమహోత్సవంలో పాల్గొన్న భక్తులు


కల్యాణంలో పాల్గొన్న భక్తులు

కోరుట్ల రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం సందర్భంగా కొరాయి ఉత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేంకటేశ్వర దేవాలయం ఆధ్వర్యంలో వెంకటాపూర్ గ్రామశివారులోని వ్యవసాయ క్షేత్రంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలకు పంచామృత అభిషేకం నిర్వహించి వేడుకలను జరిపారు. ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణం జరిపారు. అనంతరం భక్తులకు కొత్త సురేష్-స్వరూప దంపతులు అన్నప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఈవో విక్రం ఆలయ ప్రధాన అర్చకుడు బీర్నంది నరిసింహాచారి వామన్, దేవాలయ సిబ్బంది నర్సయ్య, వెంటా పూర్ మాజీ సర్పంచ్ తోట లింగారెడ్డి, వేంకటేశ్వర దేవాలయ చైర్మన్ కటుకం రాజేశం, ఆండాల్ గోష్టి బృందం సభ్యులు పాల్గొన్నారు.

కండక్టర్‌తో ప్రయాణికుడి దురుసు ప్రవర్తన

సుల్తానాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికుడు కండక్టర్, తోటి ప్రయాణికులతో దురుసుగా ప్రవర్తించాడు. హైదరాబాద్ నుంచి మంచిర్యాలకు వెళుతున్న లగ్జరీ బస్సులో ఆదివారం రాత్రి 8గంటల ప్రాంతంలో కరీంనగర్‌లో ఇద్దరు ప్రయాణికులు ఎక్కి గోదావరిఖని టికెట్టు కోసం ఐదు వందల రూపాయల నోటు ఇచ్చారు. నోటు చిరిగిపోవడంతో చెల్లుబాటు కాదని వేరేనోటు ఇవ్వాలని కండక్టర్ సూచించారు. ఈ విషయమై మద్యం మత్తులో ఉన్న ఆ ప్రయాణికుడు, ఆయనతో ఉన్న మరో వ్యక్తి దురుసుగా ప్రవర్తించారని కండక్టర్ నర్సింగం, డ్రైవర్‌తోపాటు ప్రయాణికులు తెలిపారు. దీంతో బస్సును సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే సదరు వ్యక్తులు పోలీసులతో కూడా దురుసుగా ప్రవర్తించడంతో అదుపులోకి తీసుకున్నారు. దాదాపు గంటకు పైగా బస్సు పోలీస్‌స్టేషన్ వద్ద నిలిచిపోయింది. రాత్రి పదిగంటల తర్వాత బస్సు మంచిర్యాలకు పంపించారు.

రేకుర్తి ఆసుపత్రిని సందర్శించిన హైకోర్టు జడ్జి


రేకుర్తి కంటి ఆసుపత్రిని పరిశీలిస్తున్న హైకోర్టు జడ్జి వేణుగోపాల్

భగత్‌నగర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రేకుర్తిలోని డాక్టర్ భాస్కర్ మడేకర్ ఉదార నేత్ర వైద్యశాలను రాష్ట్ర హైకోర్టు జడ్జి ఇవి వేణుగోపాల్ ఆదివారం సందర్శించారు. రేకుర్తి కంటి ఆసుపత్రి చైర్మన్ కొండ వేణుమూర్తి హైకోర్టు జడ్జి వేణుగోపాల్‌కు ఆసుపత్రిలోని పలు విభాగాలను చూపించారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం ఒక లక్ష రూపాయలను హైకోర్టు జడ్జి ఇవి వేణుగోపాల్ అందించారు. మలేసియాలో స్థిరపడిన మలేషియా తెలంగాణ అసోసియేషన్ అధ్యక్షుడు తెలంగాణకు చెందిన సైదం తిరుపతి ఆసుపత్రి కోసం యాభై వేల రూపాయల విరాళాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి ప్రకాశ్ హోళ్ల, కోల అన్నారెడ్డి, ముక్క శరత్‌కృష్ణ, మ్యాడం శివకాంత్; బట్టు వినోద్, లయన్స్‌క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల ప్రజలను కలిపేవి క్రీడా మైదానాలే

ధర్మారం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కుల, మతాలతో సంబంధం లేకుండా అన్నివర్గాల ప్రజలను కలిపేది క్రీడా మైదానాలేనని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని కమ్మరిఖాన్‌పేటలో నిర్వహించిన ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నీలో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా టోర్నీలో విజయం సాధించిన అన్నారం జట్టుకు ప్రథమ బహుమతిగా 30 వేల రూపాయల నగదు సొంతంగా అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన కమ్మరిఖాన్‌పేట జట్టుకు 15 వేల నగదుతో పాటు ఇరు జట్లకు ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా అడ్లూరి మాట్లాడుతూ ఆటలో గెలుపు, ఓటములు సహజమన్నారు. ఓడినవారు నిరుత్సాహ పడకుండా తిరిగి ప్రయత్నిస్తే ఏదోఒకరోజు గెలుపు వరిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు ప్రదానం చేస్తున్న లక్ష్మణ్ కుమార్


రోడ్డు పక్కన పొదల్లోకి దూసుకెళ్లిన లారీ

లారీ-కారు ఢీ

మల్యాల, జనవరి 5(ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల మార్గంలోని మల్యాల క్రాస్ రోడ్డు సమీపంలో ఆదివారం కారు, లారీ ఎదురెదురుగా ఢీకొట్టగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కారులోని బెలూన్లు తెరుచుకోవడంతో అందులోని వ్యక్తులు క్షేమంగా బయట పడ్డారు. లారీ అదుపు తప్పి రహదారి పక్కన పొదల్లోకి దూసుకెళ్లింది. రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.


కరీంనగర్‌లో.. ప్రథమ బహుమతి పొందిన ముగ్గుతో విజేత కొక్కొండ లహరి


జగిత్యాలలో.. ప్రథమ బహుమతి పొందిన ముగ్గుతో విజేత దుర్గ భవానీ


సిరిసిల్లలో.. ప్రథమ బహుమతి పొందిన ముగ్గుతో విజేత దబ్బెడ మనుశ్రీ

అలరించిన రంగవల్లులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆంధ్రజ్యోతి ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీలకు రాష్ట్ర స్థాయి ప్రధాన స్పాన్సర్‌గా సంతూర్, కో స్పాన్సర్ గార్డెనింగ్ పార్టనర్‌గా క్రాఫ్ట్ వారి ఫర్‌ఫెక్ట్, ప్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సంస్థలు వ్యవహరించాయి. అన్ని జిల్లాల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని చుక్కల ముగ్గులు వేశారు. వివిధ రకాల అంశాలను తీసుకుని అద్భుతంగా ముగ్గులు వేసి తమ ప్రతిభను చాటారు.

◆ ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్


కరీంనగర్‌లో.. ద్వితీయ బహుమతి పొందిన ముగ్గుతో దుర్గం రేణుక


కరీంనగర్‌లో ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు గంగాధర సీడీపీవో ఎం కస్తూరి, జిల్లా సంక్షేమ శాఖాధికారి కె సబిత, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాగ్యలక్ష్మి


కరీంనగర్‌లో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు


జగిత్యాలలో.. ద్వితీయ బహుమతి పొందిన ముగ్గుతో తుమ్మనపెల్లి అనీల


సిరిసిల్లలో.. ద్వితీయ బహుమతి పొందిన ముగ్గుతో ఎలిగేటి రూపిక


కరీంనగర్ ముగ్గుల పోటీల స్పాన్సర్ ఎలగందుల వీరేశంకు జ్ఞాపికను అందజేస్తున్న బ్రాంచ్ మేనేజర్ కళ్లెపు సంపత్‌రెడ్డి, ఎడిషన్ ఇన్‌చార్జి జయంత్‌రావు, బ్యూరో చీఫ్ నగునూరి శేఖర్


కరీంనగర్‌లో ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు, స్పాన్సర్ ఎలగందుల వీరేశం, ఆంధ్రజ్యోతి సిబ్బంది


కరీంనగర్‌లో.. తృతీయ బహుమతి పొందిన ముగ్గుతో సత్రం సరిత


జగిత్యాల ముగ్గుల పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన మహిళలు


సిరిసిల్లలో ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు


జగిత్యాల ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు


సిరిసిల్లలో ముగ్గులు వేస్తున్న మహిళలు


జగిత్యాలలో.. తృతీయ బహుమతి పొందిన ముగ్గుతో నీలం అనూష


సిరిసిల్లలో.. తృతీయ బహుమతి పొందిన ముగ్గుతో జి.కల్పన

న్యూస్ బాక్స్

ఎల్‌వోసీ అందజేసిన ప్రభుత్వ విప్

ధర్మారం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నర్సింహులపల్లికి చెందిన లైశెట్టి లక్ష్మి అనారోగ్యంతో హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. వైద్యం కోసం ప్రభుత్వ విప్ అడ్లూరి ప్రభుత్వం నుంచి రూ.3లక్షల ఎల్‌వోసీని ఆదివారం ధర్మపురిలోని క్యాంపు ఆఫీస్‌లో కుటుంబసభ్యులకు అందజేశారు. ఏఎంసీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్, మాజీ చైర్మన్ నర్సింహులు, స్వామి ఉన్నారు.

చీరల పంపిణీ

క్యాతన్‌పల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): విశ్వబ్రాహ్మణ అఫిషియల్ అండ్ ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో ఆదివారం గోదావరిఖనిలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా రామగుండం వోఏ అధ్యక్షులు రాజమౌళి చార్యులు హాజరై మాటాడారు. సంఘం నాయకులు స్వామి, మారుతిబ్రహ్మం, బాస్కర్, ప్రభాకరచారి, వెంకటేశ్వర్లు, రమణులు, వీరాచారి ఉన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో పది మందికి జరిమానా, శిక్ష

జ్యోతినగర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీపీసీ పరిధిలో కొన్ని డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో నిందితులైన 10మందికి జరిమానాతో పాటు సామాజిక సేవ శిక్ష విధిస్తూ గోదావరిఖని ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్ వెంకట్ సచిన్ రెడ్డి తీర్పు చెప్పారు. ఆదివారం గోదావరిఖని ఏరియా ఆసుపత్రిలో రోగులకు నిందితులు పండ్లు పంపిణీ చేయడంతోపాటు ఆసుపత్రి పరిసరాలను శుభ్రంచేశారు. అంతకుముందు నిందితులకు ఎన్టీపీసీ ఎస్‌ఐ ఉదయ్ కిరణ్ కౌన్సెలింగ్ నిర్వహించారు.

అంబేద్కర్ సంఘం అధ్యక్షుడిగా రాహుల్

సుల్తానాబాద్, జనవరి 5: (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణ అంబేద్కర్ సంఘం అధ్యక్షుడిగా ఆరేపల్లి రాహుల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన ఎన్నికలో ఆధ్యక్షులుగా రాహుల్, ఉపాధ్యక్షులుగా న్యాతరి కాళీచరణ్, కల్లెం రాజ్, రాకేష్, ప్రధాన కార్యదర్శులుగా వెంకటేశ్, ప్రదీప్, సతీష్, సంయుక్త కార్యదర్శులుగా ప్రశాంత్, కిషోర్, తిరుపతి, కోశాధికారిగా మోహన్, ప్రణయ్‌తో పాటు కార్యవర్గ సభ్యులుగా శివకుమార్, వరుణ్, శ్రీనివాస్, వినయ్, దిలీప్‌లు ఎన్నికయ్యారు.

ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

ఎలిగేడు, జనవరి 5(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 7న చలో హైదరాబాద్ కార్యక్రమం విజయవంతం చేయాలని, ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణను తెలంగాణ ప్రభుత్వం అమలుచేయాలని వారు మరొకసారి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు బాసంపల్లి శ్రీనివాస్ మాట్లాడారు. 12గ్రామాల్లో ఉన్న మాదిగ సామాజిక వర్గం మేధావులు, యువకులకు ప్రచార బాధ్యతలు అప్పగించారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు జల్లి రమేష్, బాసంపల్లి వినోద్, మల్లారపు అంజయ్య, ప్రధానకార్యదర్శి కప్పంపల్లి సంపత్, ఆదిరా ప్రతినిధి ఆనంపల్లి శంకర్, నాయకులు కప్పంపల్లి బాపయ్య, న్యాతరి శంకర్, సంపత్, నారాయణ, మల్లారపు మహేందర్, శంకర్, రాము పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఏసీపీ

పాలకుర్తి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండల ఫొటో, వీడియోగ్రాఫర్ల సంఘం ముద్రించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం బసంత్‌నగర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏసీపీ మడత రమేష్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వుద్ది నరేష్, ప్రధానకార్యదర్శి మాదాసు భూమయ్య, శ్రీనివాస్‌గౌడ్, సురేష్, శ్రీను, ప్రశాంత్, రామ్‌కుమార్, కడారి తిరుపతి, మధు, సాగర్, చింటు తదితరులు పాల్గొన్నారు.

ఆండాళమ్మ ఆలయానికి 'హరిత' కళ

- పచ్చని చెట్ల మధ్య సేద తీరుతున్న సందర్శకులు



ఆండాళమ్మ ఆలయం చుట్టూ పచ్చని చెట్లు..

పెద్దపల్లి రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి మండలం ముత్తారం గ్రామపంచాయతీ పరిధిలోని ఆండాళమ్మ ఆలయం పచ్చని చెట్లతో ఆకట్టుకుంటోంది. పల్లెల్లో పచ్చదనం నింపేందుకు గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వన మహోత్సవం కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా మండలంలోని ముత్తారంలో పల్లె ప్రకృతి వనాన్ని ప్రాచీన ఆండాళమ్మ ఆలయం చుట్టూ ఏర్పాటు చేశారు. ఆలయాన్ని చూసేందుకు వచ్చే సందర్శకులు పల్లె ప్రకృతి వనంలో సేద తీరుతున్నారు. వనంలో రకరకాల మొక్కలను ఏర్పాటు చేయడంతో పల్లె ప్రకృతివనంలో పార్క్ పిరిలు, వెడ్డింగ్ షూట్‌లతో పాటు, సెలవు దినాల్లో పిక్నిక్ స్పాట్‌గా మారింది. ప్రాచీన ఆలయం చుట్టూ ఏర్పాటు చేసిన నర్సరీలో సీమ తంగేడు, జామ, అల్ల నేరేడు, పులిచింత, టెకోమా, గోరింటాకు, కానుగ తదితర మొక్కలు పెంచుతున్నారు. వీటితో పాటు వాకింగ్ ట్రాక్‌కి ఇరువైపులా అందాన్నిచ్చే మొక్కలను కరీంనగర్ ప్రాంతం నుంచి తీసుకొచ్చి ఏర్పాటు చేశారు.

● పార్కు నిర్వహణపై ప్రత్యేక దృష్టి

- ఆవుల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, ముత్తారం



ముత్తారం పల్లె ప్రకృతి వనంలో పలు రకాల మొక్కల రక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. మొక్కలు ఎండిపోకుండా నిత్యం పరిశీలిస్తూ ఉపాధిహామీ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందిస్తున్నాం. ప్రాచీన ఆండాళమ్మ ఆలయాన్ని సందర్శించేందుకు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వస్తుండగా, చుట్టూ ఉన్న పల్లె ప్రకృతి వనంలో పచ్చని మొక్కల మధ్య సేద తీరుతున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే కుటుంబాలకు భరోసా..

- రామగుండం సీపీ శ్రీనివాస్..



5కే రన్ పాల్గొన్న సీపీ శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది

కోల్‌సిటీ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం రామగుండం పోలీస్ కమిషనరేట్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో 5కే రన్ నిర్వహించారు. కమిషనరేట్ కార్యాలయం వద్ద పోలీస్ కమిషనర్, ఐజీ శ్రీనివాస్ 5కే రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి మున్సిపల్ జంక్షన్ మీదుగా గాంధీ చౌరస్తా వరకు 5కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే వారి కుటుంబాలకు భరోసా ఉంటుందన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వాహనదారులు మాత్రమే వాహనాలు నడపాలని, ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రమాదాల్లో తమ విలువైన ప్రాణాలు పోగొట్టుకుంటున్నారన్నారు. కార్లు నడిపే వారు విధిగా సీటు బెల్ట్ ధరించాలని, వాహనాలకు సంబంధించి పత్రాలు అందుబాటులో ఉంచాలన్నారు. యువత తాత్కాలిక ఆనందం కోసం ర్యాష్ డ్రైవింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ చేస్తూ ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని, తల్లిదండ్రులకు మనో వేదన మిగులుస్తున్నారన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపవద్దని ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా కూడా తగ్గడం లేదన్నారు. గత ఏడాది కాలంలో కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వాహనదారులకు రూ.13కోట్ల జరిమానా విధించినట్టు సీపీ తెలిపారు. 5కే రన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని సీపీ అభినందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సీ రాజు, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, పెద్దపల్లి ఏసీపీ జీ కృష్ణ, మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాష్, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, సుందరరావు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రామగిరిఖిల్లా పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

రామగిరి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయిలో రామగిరిఖిల్లాను పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేస్తామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఆదివారం మండలంలోని బేగంపేట గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాముడు నడిచిన నేలగా పేరుగాంచిన రామగిరిఖిల్లాను అభివృద్ధి చేస్తామన్నారు. ఖిల్లా అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రూ.కోట్లను మంజూరుచేసినట్లు తెలిపారు. రామగిరి ఖిల్లాపై ఎన్నో వనమూలికలు ఉన్నాయని తెలిపారు. అన్ని హంగులతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రామగిరి క్షేత్రాన్ని అభివృద్ధి చేయడం కోసం ప్రణాళికలు సిద్ధం చేసి నిధులు మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

రామగిరి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని సెంటినరీకాలనీలో ఆదివారం ఐఎన్‌టీయూసీ నూతన క్యాలెండర్‌ను ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి, నాయకులు రామారావు, సత్యం స్వామయ్య, నరేడ్ల శ్రీనివాస్‌రావు, మహేందర్, పీవీ గౌడ్, సర్వన్, కొమురయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాగా, మండలంలోని సెంటినరీకాలనీలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో ఆదివారం యూత్ నాయకుడు మట్ల రాజ్‌కుమార్ జన్మదిన వేడుకను జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి శ్రీధర్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేక్‌ను కట్ చేసి మంత్రి ఆశీర్వాదం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వినతుల వెల్లువ..

కమాన్‌పూర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : కమాన్‌పూర్ మండలానికి ఆదివారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రాగా, పలువురు వినతి పత్రాలు సమర్పించారు. కమాన్‌పూర్ గ్రామపంచాయతీని మేజర్ గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలంటూ పలువురు రాజకీయ పార్టీల నాయకులు 350 మంది సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని మంత్రికి అందజేశారు. కమాన్‌పూర్ గ్రామపంచాయతీకి అనుకొని ఉన్న కిష్టంపల్లి గ్రామపంచాయతీని వీడదీయకుండా కమాన్‌పూర్‌ను మేజర్ గ్రామపంచాయతీగా మార్చాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు కుక్క చంద్రమౌళి, మచ్చగిరి రాము, జంగపల్లి శ్రీనివాస్, మల్లారపు అరుణ్‌కుమార్, జంగిల్లి అజయ్, పోతుల కుమార్ తదితరులు ఉన్నారు.

అలాగే మండలంలోని గుండారం రిజర్వాయర్‌ను మినీ ట్యాంక్ బండ్‌గా ఏర్పాటు చేయాలని కోరుతూ మాజీ సర్పంచ్ ఆకుల ఓదెలు మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం సమర్పించారు. మినీ ట్యాంక్ బండ్‌గా మార్చడం ద్వారా కమాన్‌పూర్, రామగిరి, ముత్తారం, మంథని ప్రాంతాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందంటూ వినతి పత్రంలో పేర్కొన్నారు.

మంత్రికి సన్మానం

కమాన్‌పూర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదివారం రాగా కాంగ్రెస్ నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు అంబీర శ్రీనివాస్, సయ్యద్ సయీద్ అన్వర్, మాజీ మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు ఎండీ ముస్తాక్, అఫ్రోజ్‌తో పాటు తదితరులు ఉన్నారు.

ఆంక్షలు లేకుండా రైతు భరోసా..

(5వ పేజీ తరువాయి)

భూములను రైతులు సాగుచేస్తున్నారు. దీర్ఘకాలిక పంట అయిన పత్తి పండించే రైతులకు రెండు సీజన్లకు రైతు భరోసా ఇస్తారా లేక ఒకటే సీజన్‌కు ఇస్తారా అనే విషయం తేలాల్సి ఉంది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఎకరానికి 7,500 రూపాయలు చొప్పున గాకుండా 6వేల రూపాయలు మాత్రమే ఇస్తామని ప్రకటించారు. పథకం అమలుచేయడంలో ఆంక్షలు విధిస్తారని అందరు ఊహించినప్పటికీ, అందరి ఊహలను పటాపంచలు చేసిన ప్రభుత్వం ఎకరానికి 1500 రూపాయలు తగ్గించుకుని అందరికీ, ఎలాంటి సీలింగ్ లేకుండా వర్తింపచేస్తామని ప్రకటించడం గమనార్హం. రైతు కూలీలకు ఏడాదికి 12వేల చొప్పున ఇస్తామని ప్రకటించినప్పటికీ, ఇంకా దీనికి సంబంధించిన విధివిధానాలను ప్రభుత్వం ఖరారు చేయలేదు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

- జిల్లా నెహ్రూ యువ కేంద్రం అధికారి రాంబాబు



మాట్లాడుతున్న నెహ్రూ యువ కేంద్రం అధికారి రాంబాబు

సుల్తానాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, సమాజంలో ఆదర్శంగా నిలవాలని జిల్లా నెహ్రూ యువ కేంద్రం అధికారి రాంబాబు అన్నారు. సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. వాలీబాల్, కబడ్డీ, అథ్లెటిక్స్, ఫుట్‌బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బహుమతుల ప్రదానోత్సవంలో రాంబాబు మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించాలని, క్రీడలు మానసిక ప్రశాంతతకు నెలకొల్పుతాయని అన్నారు. ఈ పోటీలలో వాలీబాల్‌లో సుల్తానాబాద్ జట్టు ప్రథమ బహుమతిని, సుల్తాన్‌పూర్ జట్టు ద్వితీయ బహుమతిని గెలుచుకున్నాయి. కబడ్డీ పోటీల్లో పొత్కపల్లి జట్టు ప్రథమ, సుల్తానాబాద్ జట్టు ద్వితీయ బహుమతులు పొందాయి. షటిల్ బ్యాడ్మింటన్, రన్నింగ్, షాట్‌పుట్ విజేతలుగా నిలిచిన విజేతలకు నాలుగువేల రూపాయల స్పోర్ట్స్ కిట్‌తోపాటు మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ముస్తాల రవీందర్, అమిరిశెట్టి తిరుపతి, ఏజీపీ దూడం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో మంత్రి శ్రీధర్‌బాబు పూజలు

- నేడు మున్సిపల్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మంథని, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీమహాలక్ష్మి అమ్మవారి, దత్తాత్రేయస్వామి ఆలయాలను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయాల్లో అమ్మవారిని, స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు ఆశీర్వాదం తీసుకున్నారు. ఈసందర్భంగా పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు మంత్రి శ్రీధర్‌బాబును కలిసి నూతన శుభాకాంక్షలు తెలియజేశారు. సోమవారం పట్టణంలో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.24.05 కోట్లతో పలు అభివృద్ధి పనులకు మంత్రి శ్రీధర్‌బాబు శంకుస్థాపన చేయనున్నారు. పద్మశాలి వీధిలోని ఎస్సీ బాలికల హాస్టల్ స్థలం సమీపంలో రూ. 9.20కోట్లతో మంథని మున్సిపాలిటీ నూతన భవనం, పలు వార్డుల్లో సీసీరోడ్లు, సైడ్‌డ్రైన్ నిర్మాణాలకు, రూ.8.14 కోట్లతో ఫైర్ స్టేషన్ సమీపంలో వెజ్, నాన్‌వెజ్ మార్కెట్, నిర్మాణాలతోపాటు పెద్దపల్లి, గోదావరిఖని, కాటారం ప్రధాన రహదారుల వద్ద పట్టణ శివారులో స్వాగత ద్వారాలకు మంత్రి శ్రీధర్‌బాబు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం గాంధీచౌక్‌లో జరిగే సభలో పాల్గొంటారు. ఈ మేరకు మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు చేశారు.

మకర తోరణాల ఏర్పాటు

పాలకుర్తి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని బామ్లానాయక్ తండాలో ఆదివారం అభయాంజనేయ స్వామికి మకర తోరణాల ఏర్పాటు ఉత్సవం ఘనంగా జరిగింది. తండా మాజీ సర్పంచ్ రాజునాయక్ దంపతులు ఆధ్వర్యంలో మహాయాగం నిర్వహించడంతో పాటు సీతారాములకు సైతం మకర తోరణాలు అమర్చారు. వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో ఇస్లావత్ సక్రల్, ఇస్లావత్ రాజు(తావురియా)ఇస్లావత్ రాజు(బాలు), మూడ్ రమేష్, భూక్య రాజేష్, గట్టయ్య కోట్లియా, తిరుపతి తదితరులతో పాటు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

రహదారికి 'పచ్చ'తోరణం..



పుట్నూర్, కుక్కలగూడూర్ గ్రామాల మధ్య రోడ్డు..

పాలకుర్తి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలపరిధిలోని పుట్నూర్, కుక్కలగూడూర్ గ్రామాల మధ్య గతంలో హరితహారంలో నాటిన మొక్కలు భారీ వృక్షాలుగా ఎదిగాయి. రహదారికి పచ్చ తోరణంగా మారి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. పర్యావరణ, పరిరక్షణ కోసం గత ప్రభుత్వం పల్లెప్రగతిలో భాగంగా చెట్టు నాటే కార్యక్రమాన్ని చేపట్టింది. అప్పటి అధికారుల కృషి, పట్టుదల ఫలితంగా చెట్లు రహదారికి పచ్చతోరణంగా మారాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

'మండలంగా ప్రకటించాలి'

ఓదెల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొలనూర్ గ్రామాన్ని నూతన మండల కేంద్రంగా ప్రకటించాలని అఖిలపక్ష కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు సాతూరి అనిల్ మాట్లాడుతూ, గత పాలకులు హామీ ఇచ్చి విస్మరించారని, ప్రస్తుత ఎమ్మెల్యే కూడా హామీ ఇచ్చారని తెలిపారు. ఇప్పటికైనా కొలనూర్ నూతన మండలంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో పల్లె రాకేష్, మాటూరి నర్సయ్య, పులిపాక మహేష్ పాల్గొన్నారు.

క్రీడలు పట్టుదలను పెంచుతాయి..



ఓదెలలో టోర్నీని ప్రారంభిస్తున్న నల్ల మనోహర్‌రెడ్డి

ఓదెల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : క్రీడాస్ఫూర్తి మిత్రుత్వంతో పాటు పట్టుదలను కూడా పెంచుతాయని నల్ల ఫౌండేషన్ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓదెల, సుల్తాన్‌పూర్, కన్నాల, శ్రీరాంపూర్ మండలాల స్థాయి క్రికెట్ టోర్నీని నల్ల మనోహర్ రెడ్డి ప్రారంభించారు. ఓదెలకు చెందిన క్రీడాకారులకు ప్రముఖుల మల్లికార్జున స్వామి ఆలయ మాజీ ధర్మకర్త కనికిరెడ్డి సతీష్ సొంత ఖర్చులతో టీ షర్టులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



పాఠశాలల ఉపాధ్యాయులతో జీఎం సమావేశం



కార్యక్రమంలో మాట్లాడుతున్న జీఎం లలిత్ కుమార్

గోదావరిఖని, జనవరి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇల్లందు క్లబ్‌లో ఆదివారం సింగరేణి పాఠశాలలకు 'ఓరియంటేషన్ ప్రోగ్రాం ఫర్ ఆల్ స్కూల్స్' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్జీ-1 జీఎం డీ లలిత్‌కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని సెక్టార్-2, సెక్టార్-3, సీసీసీ, మందమర్రి, గోలేటి, భూపాలపల్లి, సింగరేణి పాఠశాలల నుంచి 200మంది ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో, తరగతి గదిలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేశారు. పాఠశాలల అభివృద్ధి ధ్యేయంగా ఉపాధ్యాయులు సరైన కార్యాచరణ రూపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం గోపాల్‌సింగ్, 11గ్రూప్ ఏజెంట్ బిలక శ్రీనివాస్, మోటివేటర్ శ్రీనిగ్ రాజు, డాక్టర్ లక్ష్మీవాణి, సింగరేణి పాఠశాల సెక్టార్ -2 కరస్పాండెంట్, పాఠశాల హెడ్ మాస్టర్ బీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పట్టవా..?

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలు పూర్తయి ఏడాది గడిచినా రాష్ట్రంలో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వానికి సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సమస్యలు గుర్తులేదని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఉల్లి మొగిలి ప్రశ్నించారు. ఆదివారం ఓసీపీ-3 సీహెచ్‌పీలో జరిగిన పోస్టర్ ఆవిష్కరణలో ఆయన మాట్లాడారు. ప్రజా పాలన పేరిట విజయోత్సవాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ముందు కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చిన హామీలను గుర్తు చేసుకోవాలని అన్నారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు న్యాయంచేస్తామని, వేతనాలు పెంచడంతో పాటు చట్టబద్ధ హక్కులు కల్పించేలా కృషి చేస్తామని కోల్‌బెల్ట్ ప్రాంత కాంగ్రెస్ అభ్యర్థులు ఇచ్చిన హామీలు ఏంతవరకు అమలు అయ్యేలా కృషి చేశారో చెప్పాలని మొగిలి డిమాండ్ చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అన్యాయానికి గురైన కాంట్రాక్టు కార్మికులు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సమస్యలు తీరుతాయని ఆంధ్రా నిలిచినా నిరాశే ఎదురైనట్లు తెలిపారు. 22 జీవోను గెజిట్ చేసి సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు వర్తింప చేయాలని, హైపవర్ కమిటీ సిఫార్సు చేసిన వేతనాలు అమలుచేసి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఉల్లి మొగిలి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాలను నిలుపుకోవాలని సూచించారు. సీఐటీయూ కాంట్రాక్టు కార్మి యూనియన్ చేపట్టి ఆందోళనలకు అండగా నిలవాలని కాంట్రాక్టు కార్మికులను కోరారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

ప్రపంచ దేశాలకు ఆదర్శం భారత రాజ్యాంగం



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న యాదగిరి సత్తయ్య

క్యాతన్‌పల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాలకు భారత రాజ్యాంగం ఆదర్శమని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు వడ్డేపల్లి దాస్ అన్నారు. ఆదివారం మున్సిపల్ టీ జంక్షన్ వద్ద అంబేద్కర్, రాజేష్ దియేటర్ వద్ద ఉన్న జ్యోతిబా పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడటానికి రాజ్యాంగమే ముఖ్యమని, సకల జనులకు రక్షణగా ఉన్న రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. త్యాగధనులైన అంబేద్కర్, జ్యోతిబాపూలే ఆశయాలను గ్రామ గ్రామానికి అన్నివర్గాల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శీలం రమేష్, బొంకూరి మధు, వైన రాజేష్, సతీష్, లింగయ్య, భొందయ్య, అంతుస్, రాజమౌళి, మహేందర్, కరీం, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రూ.60 కోట్లతో మంథని-ముత్తారం తారురోడ్డు

- విలేకరుల సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు

ముత్తారం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మంథని నుంచి ముత్తారం వెళ్లే ప్రధాన రహదారికి రూ.60 కోట్లతో అభివృద్ధి పనులకు త్వరలోనే చేపడుతామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ముత్తారం మండలం మైదంబండలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదేళ్ల రాష్ట్రాన్ని పరిపాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్థం చేసిందని, తమ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలనే తాపత్రయంతో ముందుకు వెళుతున్నామన్నారు. తమ ప్రధానమైన బాధ్యత ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడమని, గాడిలో పెడితేనే ఆరు గ్యారెంటీలతో పాటు, ఎన్నికలకు ఇచ్చిన హామీలను అమలుచేస్తామన్నారు. కొంచెం ఆలస్యం అయినా కానీ తప్పకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అన్నింటిని నిలబెట్టుకుని ప్రజల ముందుకు పోతామన్నారు. రాష్ట్రంలోని రైతులకు రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేయడంతో పాటు దానికి తోడు శనివారం క్యాబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి, సహచర మంత్రివర్గం అందరూ రైతు భరోసా కార్యక్రమం చేపట్టేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. కానీ బీఆర్ఎస్, బీజేపీ పార్టీల వారు రైతు భరోసా ఇవ్వరని అసత్య ప్రచారం చేయడం సరైన పద్ధతి కాదన్నారు. రైతు భరోసా ఈనెల 26వ తేదీ నుంచి మొదలుకాబోతుందని శ్రీధర్‌బాబు వెల్లడించారు.

దొంగతుర్తి మండలం ఏర్పాటు కోరుతూ సంతకాల సేకరణ

ధర్మారం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : కాలంగా దొంగతుర్తిని మండలంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ తెరపైకి వచ్చింది. ఆ దిశగా దొంగతుర్తి గ్రామంలోని మేధావులు, విద్యావేత్తలు, ప్రభుత్వ ఉద్యోగులు, కుల సంఘాలు, యువకులు, అందరూ ఒక్కటైన కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈనెల 3న, గ్రామంలో మీటింగ్ ఏర్పాటుచేసుకొని దొంగతుర్తి మండల సాధన సమితి పేరుతో కమిటీ ఏర్పాటు చేసుకున్నారు. ఆదివారం గ్రామ ప్రజలందరి చేత సంతకాల సేకరణ శ్రీకారం చుట్టారు. సమయం చూసుకొని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తోపాటు మంత్రి శ్రీధర్‌బాబు కలవడానికి దొంగతుర్తి సాధన కమిటీ తన కార్యాచరణ సిద్ధం చేసుకుంటోంది. దొంగతుర్తి మండలం కావడానికి అన్ని అర్హతలు ఉన్నాయని గ్రామస్తులు అంటున్నారు. పెద్దపల్లి, ధర్మారం మండలాలకు సెంటర్‌పాయింట్‌గా ఉంది దొంగతుర్తిని మండలం చేయాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



సంతకాలు చేస్తున్న గ్రామస్తులు